# చిన్నకారు డ్రైవరు

నా యజమాని పేరు శ్రీహరిరావుగారు. శ్రీహరిరావుగారు మంచి వ్యాపారస్థులు. వారిది ఎగుమతి వ్యాపారం. అందుకని అస్తమానం మద్రాసు వెళ్తూవుండేవారు. ఎప్పుడూ కార్లోనే వెళుతుండేవారు. అనుకున్న క్షణంలోనే బయలుదేరి వెళ్ళవలసి రావటం దీనికి మొదటి కారణం. కారు మద్రాసులో పనులు చూసుకోవటానికి పనికివస్తుందనేది రెండవ కారణం. అందుకని అస్తమానం వారి ఇంటినే కనిపెట్టుకొని వుండవలసి వచ్చేది. రాత్రిళ్ళుకూడా ఇంటికి వెళ్ళడానికి వీలుండేదికాదు. అందుకు నా భార్యకు కొంచెం కష్టంగానే వుండేది. ఏం చేసేటట్లు? నెలకు వందరూపాయిలు ఇచ్చేవారు శ్రీహరిరావుగారు. మాటలు చెప్పుతారుగాని ఈ వూళ్ళో అరవై రూపాయిలకు మించి ఎవరిస్తారు? అందుకని నా భార్య గొణుగుతున్నా సణుగుతున్నా అక్కడే వుంటూ వచ్చాను.

నాకు మొదట్లో తెలియదు శ్రీహరిరావుగారికి ఆడవాళ్ళ గొడవ వుందని. క్రమక్రమేణా తెలిసింది. పోనీ మనకెందుకు వచ్చిన గొడవలే— అని నేను పట్టించుకోలేదు. వూరికి వెళుతున్నానని చెప్పి, అప్పుడప్పుడు ఊరుబయట వున్న ట్రావెలర్స్ బంగళాలో మకాం వేస్తూండేవాడు. అక్కడికి ఎవ్వరెవ్వరో ఆడవాళ్ళు వచ్చి పోతుండేవారు. ఏదో పనిమీద వచ్చినట్లు వచ్చేవారు.

"శ్రీహరిరావుగారు వున్నారా?" అని అడిగేవారు.

"లోపల వున్నారు" అనేవాణ్ణి.

"కొంచెం అర్జంటు పనివుండి వచ్చాను. లోపలకు వెళ్ళవచ్చా ...."

"వెళ్ళండి."

ఇట్లా అడిగి లోపలకు వెళ్ళేవారు. వచ్చిన కాసేపటికి "హోటలుకు పోయి భోజనంచేసి రావోయ్. సినిమా చూడా లనుకుంటున్నావుగా, అటు నుంచి అటే వెళ్ళి చూచిరా" అని నా చేతులో అయిదురూపాయిల నోటు పెట్టేవారు శ్రీహరిరావుగారు. నేను భోజనం చేసుకొని రెండో ఆటకు సినిమాకు వెళ్ళి వచ్చి పడుకునేవాణ్ణి. ఆయన ఎరగనట్టుగా నటించేవాడు. నేనూ యెరగనట్లు ప్రవర్తించేవాణ్ణి. నేను సినిమా చూడాలని కుతూహల పడ్డట్టే నటించేవారు. నేను దానిని నమ్మినట్టే ప్రవర్తించేవాణ్ణి. యదార్థం యిద్దరికీ తెలుసు పైగా ఒకరికి తెలుసని యింకొకరికి తెలుసు తెలియనట్టు నటించేవాళ్ళం. అట్లాగే సాగిపోయింది కొన్నాళ్ళు.

కాని నా మనస్సులో ఏదో కెలికినట్లుగా వుండేది.

మీరు చెపితే నమ్మరుగాని నేను అంతకుముందు అట్టే ఆడవాళ్ళను గురించి ఆలోచించేవాణ్ణికాదు. ఈ గండంలో చిక్కుకున్న తర్వాత ఎప్పుడూ వాళ్ళని గురించే తలచుకుంటూ వుండేవాణ్ణి. మా యజమాని దగ్గరకు రక రకాల స్త్రీలు వస్తుండేవారు. వారు రకరకాల దుస్తులు ధరిస్తూ వుండేవారు. కొందరి రవికెలకు చేతులు ఉండేవికావు, కొందరి రవికెలకు మెడ క్రింద వరకూ వుండి, యెందుకు తొడుగుతున్నారో తెలియకుండా వుండేవి. ఆ మధ్య చిన్నమ్మగారు, నాతో పక్కకొట్లోనుంచి డిటెక్టివ్ నవలలు తెప్పించి చదువుతుండేవారు. నేనూ ఆ నవలలు చదివేవాణ్ణి అందులో ఇటువంటి విషయాన్ని చెప్పటానికి వంపులు అని రాసేవారు. ఆ వంపులు కనిపిస్తూ వుండేవి. రవికెలు తొడిగేవారు. షమీజులు వేసుకునేవారు, కాని పొట్ట కనిపిస్తూనే ఉంటుండేది. అందరి పొట్టా కనిపిస్తూనే ఉంటుంది. మావాళ్ళ పొట్టలు మాత్రం కనిపించవూ? ఎప్పుడూ కనిపిస్తూనే వుంటై. కాని వీళ్ళ పొట్టలు వుండీ ఉండకుండా చూట్టానికి ముచ్చటగా వుంటై. ఎంత చూసినా యింకా చూడబుద్ధి అవుతూ ఉంటై. కొంతమంది యెత్తుమడమల బూట్లు వేసుకొని టకటకా నడుస్తూ వచ్చేవాళ్ళు. సన్నటి చీరెలు కట్టుకొని ఉండే వారేమో, వాళ్ళు నడుస్తుంటే పిరుదుల కదలిక స్పష్టంగా కనుపిస్తూ ఉండేది. ఇక వాళ్ళను గురించి ఆలోచించకుండా ఉండటం ఎలా? ఎప్పుడూ ఆలోచిస్తూ ఉండేవాణ్ణి.

నా కసలు తీరికవుండేది కాదనుకోండి. ఉన్నా ఇంటికి వెళ్ళబుద్ధి అయ్యేదికాదు. ఇంట్లో అడుగుపెట్టగానే మురికి మురికిగా గలీజు గలీజుగా ఉండేది. ఇక నా భార్య సంగతి చెప్పనే అవసరంలేదు. "వచ్చా!" అంటూ యెదురుగావచ్చే టప్పటికి కంపరంపుట్టేది. నా భార్య అంటే నాకు యిష్టం లేదు అనుకుంటారేమో, ఏ మాటకి ఆ మాట చెప్పుకోవాలి అదంటే నాకు చాలా ఇష్టం. కాని అప్పుడలా అనిపించేది.

* * * *

మా యజమానికి ఒక కూతురువుంది. ఆమెకు వివాహం అయింది. భర్త ఎక్కడో చదువుకుంటున్నారు. ఏడాదికి ఒకసారి సెలవలకు వచ్చి పోతుంటారు. ఆమెను మేము చిన్నమ్మగారు అని పిలుస్తూవుంటాం. చిన్నమ్మగారు చాలా మంచిది. ఏ విషయాల్లోనూ జోక్యం కలిగించుకునేది కాదు. గ్రంథాలయంనుంచి పుస్తకాలు తెప్పించుకొని, అస్తమానం చదువుకుంటూ ఉండేది. నేనే తెచ్చిపెట్టేవాణ్ని ఆమెకు పుస్తకాలు.

నేను రాత్రిళ్ళు నా యజమాని యింటి అరుగుమీద పడుకునేవాణ్ని. ఒక చాపా, రగ్గూ, దిండూ వుండేవి. అవి వేసుకుని పడుకునేవాణ్ని. అప్పుడప్పుడూ చిన్నమ్మగారు వచ్చి నా కష్టసుఖాలు అడుగుతుండేది. ఇంటిసంగతులు అడిగేవారు "నీకేమన్నా పిల్లలా?" అని అడిగేవారు, "నీ భార్యా నీవూ తగాదాలేకుండా సఖ్యతగా వుంటారా అని?" అడిగేవారు.

నేను చెప్పేవాణ్ణి. మాసంగతులన్నీ ఆమెకు చిత్రంగా వుండేవి. నాకు యేదో రాజకుమారి స్వర్గలోకములోనుంచి దిగివచ్చి నా కష్టసుఖాలు కనుక్కుంటున్నట్టు వుండేది.

"ఎప్పుడూ ఇక్కడే వుంటావుగదా, నీ భార్య ఏమీ అనుకోదు?" అని అడిగింది ఒకరోజు చిన్నమ్మగారు.

"ఏంచేయ్యను?" అన్నాను.

"నీ భార్య పోట్లాడదూ?"

"పోట్లాడుతుంది" అన్నాను దీనంగా.

"నువ్వేం సమాధానం చెపుతావు?" అని అడిగింది చిన్నమ్మగారు.

"చెప్పేదేముంది చిన్నమ్మగారు! దులపరించుకొని వచ్చేస్తాను" అన్నాను.

"నీకుమాత్రం పోనీ పగలుఎక్కడ తిరిగినా, రాత్రిళ్ళు ఇంట్లో వదుకుందామని వుండదూ?"

ఈ మాటకు జవాబు చెప్పటానికి నాకు నిజంగా సిగ్గు వేసింది. తలవంచుకొని, "వుండకుండా వుంటుందా చిన్నమ్మగారూ!" అన్నాను

అప్పుడప్పుడూ ఇట్లాగేవచ్చి పలకరించి పోతూవుండేది చిన్నమ్మగారు. రెండుమూడు రోజులు ఆమె వచ్చి పలకరించకపోతే నాకు దిగులుగా వుండేది.

ఒకరోజున నేను, నా యజమాని దొడ్లో వున్న మల్లెతీగకు పందిరి కట్టి పాదు చేస్తున్నా. మురికి అవుతుందేమో అని చొక్కా తీసి తవ్వుతున్నాను. ఈ తీగెకు దగ్గరలో ఎదురుగా స్నానాలగది వుంది. అక్కడ స్నానాలు చేసిన నీళ్ళు ఈ పూలచెట్టు పాదులోకి వస్తాయి అప్పుడు చిన్నమ్మగారు స్నానాలగదిలో స్నానంచేస్తున్నారని నాకు తెలియదు. నేనిక్కడ పాదు తవ్వుతున్నానని ఆమెకూ తెలిసివుండదు. ఆమె స్నానం ముగించి చీరెచుట్టుకుని, బట్టలు కట్టుకోడానికి ఇంట్లోకని వెళ్ళటానికి గబుక్కున బయటకు వచ్చింది. రవికె లేదు. నన్నుచూచి ఒక్కక్షణం అలాగే నిలబడిపోయింది. నేను చేతిలోని పారతో అట్లాగే నిలబడిపోయాను. చిన్నమ్మగారు గుక్క తిప్పుకొని గజిబిజిపడుతూ ఇంట్లోకి పరుగెత్తింది. ఆ గజిబిజిలో జారుతున్నచీరెను గుప్పెటతో పైకిలాక్కుంటూ ఒళ్ళు కప్పుకుంటూ లోపలకు పరుగెత్తింది. నేను చూస్తూ నిలబడిపోయాను. నోట మాటరాలేదు. పని చెయ్యబుద్ధి పుట్టలేదు. చేతిలోవున్న పారను విడిచి చొక్కా తొడుక్కుని బయటకు వెళ్ళాను. ఏమీ తోచలేదు. తిరిగి తిరిగి ఇంటికి వెళ్ళాను.

"ఒచ్చా!" అంది నా భార్య.

"ఒచ్చాలే" అన్నాను, ఎదురుగా నిలబడిన నా భార్యను ఎగాదిగా చూశాను.

"అట్లా చూస్తావేం; నీ కళ్ళల్లో నిప్పులు పడ" అన్నది నా భార్య సిగ్గుపడుతూ....

"అదిసరేగాని, నేను ఇంటికి వచ్చేటప్పటికి కాస్త తల దువ్వుకొని, బొట్టుపెట్టుకొని శుభ్రంగా వుండరాదటే" అన్నాను.

"ఓరి నీ సిగ్గుచితకా! నువ్వు ఒచ్చేటప్పటికి షోకులు చేసుకొని యెదురుగా రావాలంటావు? నావల్ల కాదమ్మా ఈ టక్కులన్నీ" అంది. అని, వెంటనే ఏమి ఆలోచన వచ్చిందో "అయితే ఇన్నాళ్ళనుంచీలేన్ది, ఈ సంగతి ఇప్పుడెందుకు వచ్చిందీ" అంటూ "ఎవర్నో చూచివుంటావు...." అని మొదలు పెట్టింది.

"లేదు లేవే! నవ్వుతాలకు అన్నాను" అని సర్ది చెప్పాను....

"నీ నవ్వు పాడయినట్టే వుంది. ఏడి నీళ్ళు తోడమంటావా? పొంత కుండలో వున్నయ్."

"తోడు" అన్నాను. అన్నానే గాని నాకు అక్కడ వుండబుద్ధి కాలేదు.

ఆరోజే, రాత్రికిరాత్రి నేనూ, అయ్యగారూ కారులో మద్రాసు బయలుదేరాం. మద్రాసులో 2రోజులు వున్నాం. మేము వెళ్ళిన రోజే రాజాదేవిగారు వచ్చి హోటల్లో కలుసుకున్నారు. రాజాదేవి గారిది మావూరే! మా యజమానీ వారూ ముందే మాట్లాడుకున్నట్లున్నారు— మద్రాసులో కలుసుకుందామని. ఆ రెండు రోజులూ ఇష్టం వచ్చినట్లు మద్రాసంతా తిరిగారు. బీచ్‌షికారులూ, సినిమాలూ, డాన్సులూ ఒకటేమిటి? కోలాహలంగా జరిగిపోయింది. రాత్రిళ్ళు వారున్నగది ముందే నేను పడుకునే వాణ్ణి. నేను వున్నట్లే వారికి అనిపించేది కాదు. అవన్నీ నాకళ్ళ ముందే

జరిగిపోతూ వుండేవి. నేను వారికి కావలసినవి అందిస్తూ గదిలో నుంచి బయటకూ బయట నుంచి గదిలోకి తిరుగుతుండే వాణ్ణి.

ఎక్కడికన్నా వెళ్ళినా కారు వెనకసీట్లో కూర్చునే సరస సల్లాపాలన్నీ జరుపుతుండేవారు. డ్రైవరు అనే వాడు ఒకడు వున్నాడనీ, వాడూ మనిషేననీ, వాడు వింటున్నాడనే అనిపించేదికాదు; వారికి. డ్రైవరు అనే వాడికీ ఉద్రేకాలు వుంటాయనీ, వాడు ఇటువంటి మాటలు వింటు న్నప్పుడూ, చేష్టలు చూస్తున్నప్పుడూ ఉద్రేకపడతాడనీ వారికి అనిపించేది కాదు. నేను ఏం చెయ్యను? కాసేపు వారి మాటలు వినకుండా వుందాం అనుకునేవాణ్ణి. నావల్ల అయ్యేదికాదు. మాటి మాటికీ ముందు అద్దంలో నుంచి వెనుక సీట్లో వారేం చేస్తున్నదీ చూడబుద్ధి అయ్యేది.

చూస్తూండేవాణ్ణి. ఆ రెండురోజులూ నేను పడ్డబాధ భగవంతుడికే తెలియాలి. రెండవరోజు సాయంకాలం వూరికి బయలుదేరాం. రాజాదేవి గారుకూడా మా కారులోనే బయలుదేరింది. ఊరికి బయటవున్న ట్రావెలర్సుబంగళా దగ్గరకు వచ్చేటప్పటికి చీకటి పడింది. ఆ రాత్రికి బంగాళాలో వుందాం— అన్నాడు నా యజమాని. రాజాదేవి కాస్త తట పటాయించింది. "పది గంటలయ్యేటప్పటికి మీ యింటికి పంపించివేస్తా. మీ వారు ఏమీ అనుకోరులే" అన్నాడు నా యజమాని.

"అనుకోటానికి ఏముందిలే?" అన్నది రాజాదేవి.

అందరం ట్రావెలర్స్ బంగళాలో దిగాం. స్నానాలు అయింతర్వాత నేను వరండాలో చాపవేసుకొని పడుకున్నా.... లోపలనుంచి మాటలు వినిపిస్తున్నాయి.

"ఇలావచ్చి వళ్ళోకూచో రాజా!"

"ఇక్కడ కూచున్నాగా!"

"ఇలా రావోయ్.... అరిగిపోవులే...."

రాజాదేవి వెళ్ళి ఒళ్ళో కూచుంది. "గుండీలు వూడదియ్యవద్దు జాకెట్ చిరుగుతుంది" అన్నది.

"ఎన్నిసార్లు చూచినా తనివితీరటంలేదు రాజా!"

"ఊరుకో మంటూవుంటే" అన్నది రాజాదేవి చిలిపిగా.

"ఊరుకోను...."

ఇక నవ్వులు....అంతలో నిశ్శబ్దం....నేను నరాలు బిగపట్టుకొని పడుకున్నాను. అలా యెంతకాలం గడిచిందో నాకు తెలియదు. మళ్ళీ లోపలనుంచి మాటలు వినిపించినయ్.

"బట్టలన్నీ నలిపేశావు, జాకెట్టు గుండీలు వూడిపోయినయి. చూడు....ఇక్కడ చిరిగిపోయింది కూడా. ఒట్టిమోటు వాడివి" అంటూ వుంది రాజాదేవి.

"మీ ఆయన అడిగితే నేను చింపానని చెప్పు" అన్నాడు నా యజమాని.

"నేను చెప్పను బాబూ"

"ఏం?"

"ఎలా చింపాడు? ఏమేమి అన్నాడు? యేమేమి చేశాడు.... అని అన్నీ వర్ణించి చెప్పేదాకా ప్రాణాలు తీస్తాడు" అన్నది రాజాదేవి.

మళ్ళీ ఇద్దరూ నవ్వుకున్నారు.

"సరే, ఇకనేను వెళ్ళివస్తా. మరీ ఆలస్యం అయితే బాగుండదు" అన్నది రాజాదేవి.

ఇద్దరూ బయటకు వచ్చారు. నా యజమాని నన్ను పిలిచాడు. నాకు యెలా లేవాలో తెలియలేదు. మెదలకుండా పడుకున్నా.

"వీడు ఎక్కడన్నా చెపుతాడేమో" అన్నది రాజాదేవి.

"వాడిమొహం. వాడికేం తెలుసని చెపుతాడు! ఏదో స్నేహం అనుకుంటాడు, అంతకంటే వాడి ఆలోచన దూరంపోదులే" అన్నాడు నా యజమాని. మళ్ళీ పిలిచాడు. నేను లేచాను.

"కారు స్టార్టుచేసి రాజాదేవిగారిని యింటిదగ్గర దింపి రావోయ్" అన్నాడు.

రాజాదేవి కారులో వెనుకసీట్లో వొత్తిగిలి కూర్చొని వుంది. ముందు అద్దంలోనుంచి ఆమెను చూశాను. నలిపివెయ్యబడ్డ మల్లెపువ్వు చెండులా వుంది. "నా పిచ్చితల్లే!" అని సముదాయించబుద్ధి అయింది నాకు. నిజంగా ఆమెను చూస్తే చాలా జాలివేసింది.

ఆమెను యింటిదగ్గర దింపి, నా యజమానీ నేనూ కారులో యింటికి వెళ్ళేటప్పటికి పదకొండు గంటలవుతుంది. ఇంట్లో అందరూ అప్పుడే భోజనాలు ముగించుకున్నట్లు ఉన్నారు. నా యజమాని సరాసరి మేడమీదకు వెళ్ళారు. నేను కారు షెడ్‌లో పెట్టి యింటికి వెళ్ళబుద్ధికాక అరుగుమీద చాప పరచుకొని పడుకున్నా. కాని నిద్దర పట్టలేదు. ఒకటే ఆలోచనలు. అంతలో మద్రాసువెళ్ళేరోజు స్నానాల గది దగ్గర జరిగిన సంగతి జ్ఞాపకం వచ్చింది! చిన్నమ్మగారు యేం చేస్తుంటారో ఇప్పుడు! తలుపుదగ్గర అలికిడి అయింది. నెమ్మదిగా కళ్ళు తెరిచి చూశాను. చిన్నమ్మగారు, తలుపు దగ్గర నిలబడి ఉన్నారు. ఏదో ఆలోచిస్తూ నుంచున్నారు. పలకరించటానికి ఆమెకు సిగ్గుగావుండి వుంటుంది——అనుకున్నాను.

"ఏం చిన్నమ్మగారూ?" అన్నాను మామూలు ధోరణిలో.

"ఇక్కడ పడుకున్నావేం? ఇంటికి వెళ్ళవూ?" అన్నది.

"లేదు చిన్నమ్మగారూ!" అన్నాను.

"నువ్వు వెళ్ళకపోతే నీ భార్య బెంగ పెట్టుకోదూ!" అన్నది.

ఏం చెప్పాలో తోచక, "బెంగ కేముంది లెండి" అన్నాను. అనగానే, చటుక్కున ఒక సంగతి తట్టి "చిన్నయ్యగారు ఈ సెలవలకు వస్తారా అమ్మా" అన్నాను.

"రావచ్చు" అన్నది ఆమె.

"పోనీ మీరుకూడా వెళ్ళి అక్కడే ఒక ఇల్లు అద్దెకు తీసుకొని ఉండిపోగూడదా అమ్మా?" అన్నాను.

"నీకు తెలియదు" అన్నది. ఊరుకున్నది. ఆమె కళ్ళ వెంట కన్నీటిచుక్కలు రాల నారంభించినై. నేను ఆమెను తేరిపార చూశాను. రెండురోజుల క్రితం స్నానాలగది దగ్గర జరిగిన సంగతి జ్ఞాపకం వచ్చింది. ఒళ్ళు పుల్పొంగింది.

"ఊరుకోండి చిన్నమ్మగారూ" అని భుజంమీద చెయ్యివేశాను. కన్నీరు తుడిచాను. అంతలో యేం జరిగిందో యేమో? ఆమెను దగ్గరకు తీసుకొని ముద్దు పెట్టుకున్నాను. ఒక్కక్షణం ఆమె తన కన్నులను తానే నమ్మలేక చూస్తూ నిలబడింది. కెవ్వున కేకవేసి నా చేతులలో మనిషి చేతులలో వుండగానే జావలాగా జారిపోయింది. నా యజమాని "ఏమిటి? ఏమిటి!" అంటూ వచ్చారు. పెద్దమ్మగారుకూడా ఇంట్లోనుంచి వచ్చారు. "ఏమిట్రా, ఏం జరిగిందిరా?" అని నన్నడిగారు. నేను ఏమీ మాట్లాడ లేదు. "బెల్లంకొట్టినరాయల్లే మాట్లాడవేరా?" అన్నారు. ఏమి మాట్లాడేది?

"ముందు అమ్మాయిని లోపలికి పట్టు" అన్నాడు నా యజమాని. ఇద్దరూ చిన్నమ్మగారిని లోపలకు తీసుకువెళ్ళారు.

* * * *

మర్నాడే నా యజమాని నా మీద వజ్రపుటుంగరం దొంగిలించానని కేసుపెట్టారు. పోలీసులు వచ్చి అక్కడ వెదికి ఇక్కడ వెదికి చివరికి ఆ ఉంగరం నేను డ్రైవ్ చేసే చిన్నకారు కుషన్ల క్రింద దొరికిందనీ, నేను దొంగిలించి దాన్నక్కడ దాచాననీ చెప్పి నన్ను జైల్లో పెట్టారు. రేపే విచారణ. నాకు శిక్ష తప్పదు. నేను చిన్నమ్మగారికి ద్రోహం చేశాను, నిజమే. కాని ఆ పని నేనే చేశానా? దానికూడా బాధ్యుడు నా యజమాని శ్రీ హరిరావుగారు కాదూ? నన్ను చూడటానికి నిన్న నా భార్య వచ్చింది. "ముండనష్టపు దచ్చినాడివి - ఆ పెద్దోళ్ళ కొంపలో జేరావు, అన్నీ వాళ్ళ బుద్ధులే అబ్బినయ్ నీకు" అన్నది.